# రూ పా యి

సూర్యుడు సముద్రస్నానం చేస్తున్నాడు, తరంగాలు ఉత్సాహంతో పొంగి పోతున్నాయి. అరుణోదయంతోటే నిద్రలేచి బీచ్ రోడ్డుమీద నడుస్తూ ఆ సుందరదృశ్యాన్నిచూచి ఆనందిస్తున్నాను. అక్కడక్కడ చెదురుగా జనం వస్తూ పోతూ కనిపిస్తున్నారు. పొద్దున నిద్ర లేవగానే ఆ రోడ్డు ఒకసారి చుట్టిరావటం నాకు అలవాటు.

నాముందుగా ఒక వ్యక్తి నెమ్మదిగా నడుస్తూ ఆ ఆనందాన్ని పంచుకుం టున్నట్లు కనిపెట్టాను. అంతకిముందెప్పుడూ ఆయనని చూడలేదు. ఎవరో బహుశా పనిమీద వచ్చి సూర్యోదయ సుందరదృశ్యాన్ని చూసి ఆనందించటానికి బయలుదేరి ఉంటాడు!

యథాలాపంగా అప్పుడప్పుడు అతని వైపు చూస్తూ వెనక నడుస్తున్న నేను ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను. అతని చేతిలోంచి ఒకరూపాయ నాణెం మెరుస్తూ కిందపడ్డది. రూపాయి చేతులో ఎందుకు పెట్టుకోవలసి వచ్చిందో, అది జారిపోయినా అత నెందుకు గమనించలేదో నాకు తెలి యక ఆశ్చర్యం వేసింది. ఆ నాణెంతీసి అతన్ని పిలిశాను.

'ఏమండీ'

అతను వెనుతిరిగి చూశాడు.

'ఇదిగో, మీ రూపాయి కిందపడిపోయింది.'

అతను నా వైపోసారి చూసి చిరునవ్వు నవ్వాడు. తరువాత నా చేతిలోని రూపాయి అందుకుని రెండడుగులు వేసిరోడ్డుప్రక్కగా విసిరివేశాడు! నేను

విస్మితుడనైనాను. ఇతని కేమైనా మతిస్థిమితం తప్పిందా ? కుతూహలంతో అతనివైపుచూశాను.

'అదేమిటండీ, రూపాయి పారేస్తారేం ?' సమాధానంగా చిరునవ్వు నవ్వాడతను.

'మంచిదికాదా ?'

'మంచిదేనండీ.'

'మరి !'

'దానికి ఓ ప్రబలకారణం ఉందండీ.' నాకు కుతూహలం పెరిగింది.

'మీ కభ్యంతరం లేకపోతే ఆ కారణమేమిటో చెబుతారా ?'

'తప్పక చెబుతాను. దానికేం ?'

అతను బీచ్ వైపు దారితీశాడు. నే నతన్ని అనుసరించాను.

'మీకేం తొందరపనిలేకపోతే, కాసేపు ఇలా ఇసుకలో కూర్చుందాం.' అన్నాడతను.

ఇద్దరమూ సముద్రానికెదురుగా కూర్చున్నాం. నే నతని ముఖంలోకి 'ఇక చెప్పండి' అన్నట్టుగా చూశాను. అతను ప్రారంభించాడు :

నా పేరు రామ్మూర్తి.

పదేళ్ళక్రితం ఈ పట్నంలోనే నేను బి.ఏ. చదివి ప్యాసయ్యాను. ఒక సంవత్సరం ఉద్యోగంకోసం నానాఅగచాట్లు పడ్డాను. దొరకలేదు. ఎలా దొరుకుతుంది? నాకు క్లాసు వచ్చినా సిఫారసుచేసే పెద్దమనుష్యుల అండ లేదు. బహుశా చొరవకూడా అంతగాలేదేమో. ఫలితం నిరుద్యోగినై జీవితంపట్ల నాకు నిరాశాభావం పెంపొందటం. చదువుకోసమే అష్టకష్టాలుపడవలసివచ్చింది. అక్కడా అక్కడా డబ్బు పోగుచేసుకుని చదివాను. ఇంక ఎవర్నీ ఏది యాచించటానికి మన సొప్పలేదు. అతికష్టంమీద కొన్ని

ట్యూషన్లు కుదుర్చుకొని జీవయాత్ర గడపసాగాను. అందులో కూడా పోటీ ఎక్కువై ఇంక బ్రతుకే దుర్భర మనిపించింది. ఆ తరుణంలో ఒక చిన్న గడ్డిపోచ ఆధారంగా దొరికినా గొప్ప సహాయం లభించినంత ఉత్సాహం కలిగేది.

ఆ సమయంలోనే కొడిగట్టిన దీపాన్ని ఏగద్రోసినట్టు జీవితంలో ఒక ప్రోద్బలం దైవనిర్ణయంగా లభించింది. చెబితే మీరు నవ్వుతారేమో, ఆ ప్రోద్బలం మరేమీ కాదు. ఒక్క రూపాయి. అవును ఒక్కరోజు ఉదయాన్నే ఈ రోడ్డుమీదే ఇలాగే నడుస్తూ వెళుతున్నాను. చెప్పులేని కాలికి తగిలి ఒక రూపాయినాణెం తళుక్కున చిరునవ్వుతో పలకరించింది. తీసుకున్నాను. నేను దురదృష్ట వంతుడిననే భావం ఒకటి నాలో ఎంత కాలంగానో పేరుకుపోయింది. లేకపోతే మంచి ఉద్యోగమేనో దొరకవలసింది, సుఖమయ జీవితాన్ని గడుపుతూ ఉల్లాసంగా ఉండవలసింది. జీవిత పర్యంతరం నా దురదృష్టం నన్ను వెంటాడుతుందనే ఒక భయం నన్ను వదలకుండా పీడించేది. అలాంటిది ఒకరూపాయి— ఆరోజులలో ఒకరూపాయి ఒక వందరూపాయలతో సమానంగా భావించేవాడిని. హఠాత్తుగా, ఆయాచితంగా నాకు లభించింది. రూపాయి విలువ కాదు ముఖ్యం. ఒక వింత మానసికప్రవృత్తికిలోనై నేను చికాకు పడుతున్న సమయంలో, 'నువ్వు దురదృష్టవంతుడివికావు' అన్నట్టు నన్ను వెన్నుతట్టి, జీవితరంగంలోకి ధైర్యంగాఉరికి సాధించదలచుకున్నది సాధించటానికి నడుంకట్టమని శ్రీదేవి ప్రోద్బలపరుస్తున్నట్టు కలిగిన అనుభూతి నా జీవితాన్నే మార్చివేసింది.

ఆ రూపాయి నా దురదృష్టాన్ని పటాపంచలు చేసింది. ఏం చేశానో తెలుసా ? ఆ రూపాయితో తమలపాకులు వగైరా కిల్లీసామాగ్రి కొన్నాను. కిల్లీలు కట్టి అమ్మసాగాను, లాభం వచ్చింది. అంతా పెట్టుబడి

పెట్టాను. కొట్టు అద్దెకు తీసుకున్నాను. ఇంకా ఇతర చిల్లరవ్యాపారాలు కూడా ప్రారంభించాను, కలిసివచ్చింది. వందలనుంచి వేలదాకా పెట్టుబడి పెరిగింది. తర్వాత ఒక బట్టలకొట్టు పెట్టాను. లాభాలు కోరుకోవటమే తడవు. సిమెంటు ఏజన్సీ తీసుకున్నాను. పేపరు ఏజన్సీ తీసుకున్నాను. పెట్టుబడి హెచ్చువేతలు నేర్చుకుంది. ఇప్పుడు నేను ఏది పట్టుకున్నా బంగారమే. శ్రీమంతుల్లో నేను ప్రముఖుడిని.

ఒక విషయం చెప్పమరిచాను. ఆ రూపాయి దొరికినదే తడవు నే నీ పట్నం వదలి వెళ్ళాను. ఎందుకో అలాంటి హెచ్చరిక కలిగి ఆ పని చేశాను. అప్పుడప్పుడు పనిమీద ఈఊరు వస్తూంటాను. వచ్చినప్పుడల్లా రెండు మూడు రోజు లుంటాను. ఈసారి వచ్చినప్పుడు అకస్మాత్తుగా ఒక భావం కలిగింది. నేను తీసుకొన్న రూపాయి ఏ దురదృష్టవంతుడిదో ? అది అతనికి ఎంత అవసరమో, తర్వాత ఆదారిన వచ్చి ఎంత వెతుక్కున్నాడో ! నాకు సిరి వచ్చింతర్వాత చాలా దానాలుచేశాను. చేసిన దానం చెప్పకూడదంటారు. కాని మాట వచ్చిందికనుక చెబుతున్నాను. అయినా నాకు తృప్తిగాలేదు. ఇవాళ ప్రొద్దునే ఇలా బయలుదేరగానే చప్పున జ్ఞానోదయం అయింది. నాలాగే ఎవరో ఆశతో అరుణరేఖల కోసం ఎదురుచూసే వాళ్లెందరో ? ఒక అవకాశం ఎందుకివ్వకూడదు ! ఇలా అనిపించి రూపాయినాణెం జారవిడిచాను—ఇదీ సంగతి.

అతను ముగించాడు. ఏవేవో భావాలు నాతో పోటీపడసాగాయి. ఇద్దరమూ లేచాము, వచ్చినదారినే మళ్ళాము. కొంత దూరంలో ఒక గుంపు కనిపించింది. ఏవో మాటలు గట్టిగా వినిపించసాగాయి. దగ్గరికి వచ్చి చూశాము.

జనం ఇద్దరు కుర్రవాళ్ళని విడదీస్తున్నారు. ఆ ఇద్దరుకుర్రాళ్లూ, మట్టికొట్టిన దుస్తులతో, రేగిన పౌరుషంతో రోజుతూ కోడిపుంజుల్లా కలియబడ సాగారు. విచారించగా తెలిసింది. ఓక రూపాయి నాణాన్ని నేను ముందు చూశానంటే, నేను చూశానని వారిద్దరూ కొట్టుకోసాగారట. ఈవార్త వినగానే నేను రామ్మూర్తి ముఖంలోకి చూశాను. ఆయన వదనం వివర్ణమైంది.

(1964)

— o —